నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

మెదక్‌లోని పరీక్షా కేంద్రం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24: నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పదో తరగతిలో 680 మంది, ఇంటర్మీడియెట్‌కు 1060 మంది పరీక్షలు రాయనున్నారు. పదో తరగతికి మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లో ఒక్కటి చొప్పున పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్‌కు మెదక్‌లో 2, నర్సాపూర్‌లో 2, తూప్రాన్‌లో 1 పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్‌కు తరలిరావాలి

బాబుల్ రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 24: నేడు మెదక్‌లో ఎమ్మెల్సీ, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ వేయనున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే రోడ్‌షోకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి పిలుపునిచ్చారు. వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, పార్టీ ప్రముఖులు హాజరవనున్నారని పేర్కొన్నారు.

రైలు ఢీకొని యువతి మృతి

రమ్య (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 24: రైలు ఢీకొని యువతి మృతి చెందిన ఘటన నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన పంబాల రమ్య(18) తన పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కామారెడ్డి నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొని రమ్య అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కామారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతిరాలి తండ్రి పంబాల చక్రం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రమ్య పొలంపనులు చూసుకునేది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు.

నేడు పేటలో విద్యుత్ కోత

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24: పెద్దశంకరంపేటలో గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 24: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వెల్దుర్తి శివారు గంగమ్మ దేవాలయం వద్ద బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరంచ గ్రామానికి చెందిన బీరయ్య తూప్రాన్ నుంచి వెల్దుర్తి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెల్దుర్తి శివారు గంగమ్మ దేవాలయం వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి గాంధీ దవాఖానకు తరలించారు.

ఘనంగా బేతాళ స్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, ఏప్రిల్ 24: అల్లాదుర్గంలోని బేతాళస్వామి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పోలేరమ్మ ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం పోచమ్మకు బోనాలు సమర్పించనున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫస్టియర్‌లో జిల్లాకు 28వ ర్యాంక్
- సెకండ్ ఇయర్‌లో 31వ ర్యాంక్
- డీఐఈఓ సత్యనారాయణ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 28వ ర్యాంక్, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 31వ ర్యాంక్ వచ్చిందని డీఐఈవో సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 5905 మందికి 2786 మంది విద్యార్థులు 47.18 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 602 మందికి 405 మంది విద్యార్థులు 57.25 శాతం ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షల్లో జనరల్‌లో 5295 మందికి 3044 మంది విద్యార్థులు 57.49 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 528 మందికి 383 మంది విద్యార్థులు 72.54 శాతం ఉత్తీర్ణులయ్యారు.

తూప్రాన్ డివిజన్ టాపర్‌గా మానస

చేగుంట, ఏప్రిల్24: ఇంటర్ ఫలితాల్లో చేగుంట మోడల్ కళాశాలలో బైపీసీలో ఎం.మానస 943 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో జె.మహేశ్ 903 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జె.తేజశ్రీ, ఎంపీసీలో 418, బైపీసీలో కె.దేవిక 413 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టి.మౌనిక 468, రెండో సంవత్సరంలో బి.ప్రవళిక 931 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నర్సాపూర్‌లో సత్తాచాటిన మోడల్ విద్యార్థులు

నర్సాపూర్, ఏప్రిల్ 24: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జక్కపల్లి గ్రామ సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో కీర్తన 951, బిపీసీలో స్ఫూర్తి 928, సీఈసీలో రమ్య 922 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో భవానీ 464, బిపీసీలో నిఖితగౌడ్ 413, సీఈసీలో వరలక్ష్మి 481 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరంలో సంధ్యారాణి 405, ద్వితీయ సంవత్సరంలో మోహన్ 860 మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాళ్లు తెలిపారు.

వెల్దుర్తిలో 33శాతం ఉత్తీర్ణత..

వెల్దుర్తి, ఏప్రిల్ 24:ఇంటర్ ఫలితాల్లో వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 33శాతం, మొదటి సంవత్సరంలో 15శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో వైష్ణవి 838 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. సీఈసీలో మహిమ 815, బైపీసీలో గౌతమి 814 మార్కులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో

రామాయంపేట డివిజన్ టాపర్‌గా సమన్వితరెడ్డి (936)

తూప్రాన్ డివిజన్ టాపర్‌గా ఎం.మానస (943)

సాత్విక 359 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది.

రామాయంపే డివిజన్ టాపర్‌గా ప్రభుత్వ కళాశాల విద్యార్థిని

రామాయంపేట, ఏప్రిల్ 24: రామయంపేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో సమన్వితరెడ్డి బైపీసీలో 1000కి 936 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచింది. విద్యార్థిని మంచి మార్కులు సాధించడంతో పలువురు అభినందించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆదర్శ పాఠశాల మొదటి సంవత్సరం ఎంపీసీలో 100శాతం, బైపీసీలో 98శాతం, ఎంఈసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో మానస 967, బైపీసీలో మల్లేశ్ 912, సీఈసీలో దివ్య 918, ఎంఈసీలో శ్రీభవాని 817 మార్కులతో పతిభను కనబరిచారు.

రేగోడు మోడల్ కళాశాలలో

రేగోడ్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో మోడల్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో 69శాతం, ద్వితీయ సంవత్సరంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎంపీసీలో సింధూ 446/470, బైపీసీలో పూజ 416/460, సీఈసీలో గణేశ్ 318/500, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో సాయికిరణ్ 959/1000, బీపీసీలో గొల్ల మల్లేశ్ 959/1000, సీఈసీలో పూజిత 783/ 1000 మార్కులు సాధించారు.

పోలింగ్‌కు సన్నద్ధం కావాలి

- ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ ప్రూట్నీ, బ్యాలెట్ పేపర్, ముద్రణ, ఓటింగ్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ఏప్రిల్ 26వ తేదీ నాటికి ఓటరు తుది జాబితా రూపొందించాలన్నారు. ప్రతి ఓటరు స్లిప్పు పంపిణీకి నిర్దేశిత షెడ్యూల్ రూపొందించి, బూత్ స్థాయి అధికారులతో ప్రతి ఓటరుకు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ లైన్ల వద్ద నీడ కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈవీఎంలపై బ్యాలెట్ పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 12 డీ కింద ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న అత్యవసర విధుల నిర్వహణ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఇంటి వద్ద నుంచి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల ఓట్ల స్వీకరణకు అవసరమైన మేర బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీరు అందుబాలులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో వెబ్ క్యాస్టింగ్ చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు సమరించాలన్నారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహించి ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియలో ఈవీఎంలు ఇబ్బందులకు గురైతే వెంటనే రిజర్వ్ ఈవీఎంలను సెక్టార్ అధికారులు మార్చేలా సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ శాతంపై 3 గంటలకు, 5 గంటలకు అందించే నివేదికలు పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్డీవో శ్రీనివాస్ రావు, మెదక్ ఆర్‌డీవో రమాదేవి, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా సిబ్బంది తదితరులు

మామిడి పండ్ల సాగుపై అవగాహన

రైతు వేదికలో శాస్త్రవేత్త డాక్టర్ రంజితతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రామాయంపేట రైతులు, అధికారులు

రామాయంపేట, ఏప్రిల్ 24: రైతులు మామిడి పంటలపై అవగాహన ఏర్పర్చుకోవాలని ఏ అవసరం వచ్చినా వ్యవసాయశాఖ అధికారులను నేరుగా సంప్రదించాలని హైదరాబాద్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రంజిత తెలిపారు. బుధవారం రామాయంపేట రైతువేదికలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. వరి కోతల అనంతరం రైతులు లాభాలు గడించాలంటే పంట మార్పిడి చేసుకోవాలన్నారు. సులభంగా వచ్చే పంట మామిడి పండ్ల సాగును ఎంచుకోవాలన్నారు. మామిడి సాగు చేసే ముందు పంటనంతా కలియ దున్ని ట్రాక్టర్‌తో కాల్వల్లా భూమిని చదును చేసి, అందులో మామిడి మొక్కలు నాటాలన్నారు. మామిడి పూతదశకు వచ్చే వరకు వాటికి సంబంధించిన రసాయనాలు వేయాలన్నారు. రసాయనాలతో లాభాలు గడించవచ్చన్నారు. నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెంపొందించేందుకు రైతులు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. కర్బన పదార్థంతో మామిడి పూతతో బాటు పిందెలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి వసంత సుగుణ, రామాయంపేట, నిజాంపేట అధికారులు రాజ్‌నారాయణ, సతీశ్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు నామినేషన్

నామినేషన్ వేయడానికి వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

మెదక్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, మదన్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సుహాసినితో కలిసి మెదక్‌లో సర్వ మత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల అధికారి రాహుల్ రాజ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. మెదక్ ఎంపీగా నీలం మధు ముదిరాజ్ భారీ మెజార్టీతో గెలుస్తున్నాడని మైనంపల్లి హన్మంత్‌రావు ధీమా వ్యక్తంచేశారు. సర్వ మతాల వారి నమ్మకాలను గౌరవించే ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని నీలం మధు అన్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ చైర్మన్ సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24: పెద్దశంకరంపేటకు చెందిన మాజీ ఎంపీపీ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఇంటర్ ఫలితాల్లో 'గీతా' సత్తా

డి.అభినయశ్రీ, (991/1000)

సి.హెచ్. వైష్ణవి (467/470)

తూప్రాన్, ఏప్రిల్ 24: ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో ఎంపీసీ మొదటి సంవత్సరం నుంచి సీహెచ్. వైష్ణవి, టి.వినయ్ 470కి 467 మార్కులు సాధించారు. బైపీసీలో ఎ.జశ్వంత్‌రెడ్డి 440కి 435 మార్కులు, ఫజల నిఖత్ 440కి 432 మార్కులు, సీఈసీలో సీహెచ్.ప్రశాంత్ 500లకు 484 మార్కులు, సీహెచ్.నిహారిక 500లకు 478 మార్కులు సాధించి, సత్తా చాటారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్‌కె.కౌసర్ 1000కి 988 మార్కులు, శ్రీజ 987 మార్కులు, బైపీసీలో అభినయశ్రీ 991, భవానీ 978, సీఈసీలో కె.మోజెస్ 972, సాయిని 944 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, డైరెక్టర్లు కె.నారాయణ గుప్తా, బి.రవీందర్‌గౌడ్, ఎం.వెంకటకృష్ణ, ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపక బృందం వారిని అభినందించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24: పెద్దశంకరంపేటలో శుక్రవారం నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని బాయికాడి పద్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల ప్రచార సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించే సభకు హెలిప్యాడ్ స్థలం పరిశీలించినట్లు తెలిపారు. ఈ సభను విజయవతం చేసేలా ఏర్పాట్లు చేపట్టాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. పెద్దశంకరంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాన్ని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో మెదక్ డీఎస్పీ రాజేశ్ పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధుసూదన్, నాయకులు ఆర్ఎన్ సంతోష్, గంగారెడ్డి,అంజిరెడ్డి, జహంగీర్, పున్నయ్య, తదితరులున్నారు.

శేరిపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఇండ్ల శ్రీనివాస్

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ చేగుంట, నార్సింగి మండలాల అధ్యక్షులు

చేగుంట, ఏప్రిల్ 24: నార్సింగి మండలంలోని శేరిపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఇండ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నార్సింగి, చిన్నశంకరంపేట పార్టీ మండల అధ్యక్షులు మైలరాం బాబు, పట్లోరి రాజు తెలిపారు. బుధవారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారి సంతోష గొండస్వామి, మెదక్ జిల్లా రైతు బంధు డైరెక్టర్ జమాల్‌పూర్ రమేశ్, శేరిపల్లి మాజీ ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మీ రమేశ్, చెప్యాల సత్యనారాయణ, చింతల మల్లేశం, బోయిని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

రామాయంపేట, ఏప్రిల్ 24: బాల్య వివాహాలు, మహిళలపై గృహహింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సఖీ కేంద్ర నిర్వాహకురాలు ఎం.బాలమణి, పారామెడికల్ మంజుల అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మాపూర్ శివారులో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24: రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటు లో ఉంటానని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టెంకటి గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీబీ పాటిల్ పదేండ్లు ఎంపీగా ఉన్నా ఎవరికీ ఏమీ చేయలేదన్నారు. ఆయన ఆస్తులు కాపాడుకోవడానికి మాత్రమే పోటీ చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి 5 ఏండ్లు ఎంపీగా ఈ మండలానికి చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జడ్పీటీసీ విజయరామరాజు, నాయకులు అంజయ్య, సాయిలు, కాశీరాం, సంగమేశ్వర్, దుర్గయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24: మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో దామోదర్, గ్రామ ప్రత్యేకాధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో పశువుల తొట్టీలను శుభ్రపరచి, వాటిలో నీరుండేలా చూడాలని పశువైద్యాధికారి గీతా మాలిక సూచించారు. సమావేశంలో వైద్యాధికారి సాయి సింధు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శివకుమార్, ఎంపీటీసీలు ప్రసాద్‌గౌడ్, జయమ్మ, రాణమ్మ, సునీత, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడాపరికరాలు అందజేత

యువకులు, చిన్నారులకు క్రీడాపరికరాలను అందజేస్తున్న నాయకుడు కృష్ణ

వెల్దుర్తి, ఏప్రిల్ 24: మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో యువకులు, చిన్నారులకు మాజీ సర్పంచ్ రంగిలత, కృష్ణ క్రీడాపరికరాలు అందజేశారు. వేసవి సెలవులు రావడంతో పలు క్రీడల్లో శిక్షణ తీసుకోవడం, నిత్యం ప్రాక్టీస్ చేయడానికి క్రీడా పరికరాలు అందించాలన్న విజ్ఞప్తి మేరకు క్రికెట్, వాలీబాల్, క్యారమ్, చెస్ వంటివి అందజేసినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి ఓటరు సమాచార పత్రాల పంపిణీ

నర్సాపూర్ రైతువేదికలో మాట్లాడుతున్న తహసీల్దార్ కమలాద్రి

నర్సాపూర్, ఏప్రిల్ 24: నేటి నుంచి ఓటరు సమాచార పత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 307 పోలింగ్ కేంద్రాల్లో గురువారం నుంచి బీఎల్‌వోలు ఓటరు సమాచార పత్రాలను పంపిణీ చేస్తారన్నారు. తహసీల్దార్, బీఎల్‌వో సూపర్‌వైజర్లు పంపిణీని పర్యవేక్షిస్తారన్నారు. స్లిప్పుల పంపిణీ ఈనెల 25 నుంచి మే 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేటలో కళాకారుల ఆటాపాట

రామయంపేట, ఏప్రిల్ 24: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కళాకారులు తమ ఆటపాటలతో బుధవారం రామాయంపేటలో ప్రధాన రహదారిలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారుల బృందం ఎలా సిద్ధులు, బిట్ల ఎల్లం, శివ్వాల్ల కృష్ణ, విజయలక్ష్మి, దేవదాస్, మాధవి, శేఖర్, రామారావు ఉన్నారు.

నర్సరీలను కాపాడే బాధ్యత కార్యదర్శులదే

రామాయంపేట, ఏప్రిల్ 24: నర్సరీలను కాపాడే బాధ్యత కార్యదర్శులపై ఉన్నదని ఎంపీడీవో షాజిల్లావుద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని కిషన్‌నాయక్ తండాలోని నర్సరీని పరిశీలించి, కార్యదర్శికి సూచనలు సలహాలు ఇచ్చారు. నర్సరీల్లో మొక్కలు కాపాడేందుకు షెడ్‌నెట్లను మంజూరు చేసిందన్నారు. మొక్కలకు నీళ్లు పెట్టాలన్నారు.